క్లుప్తంగా...

నేడు శ్రీలక్ష్మీ నరసింహస్వామి జన్మస్తవం

నాంపల్లి: రెడ్‌హిల్స్‌లోని యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ఈనెల 4న లక్ష్మీనరసింహస్వామి జన్మస్తవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా ఉదయం 6 గంటలకు స్వామివారికి అభిషేకం, 8 గంటలకు హోమం, 10 గంటలకు సత్యనారాయణ వ్రతం, సాయంత్రం 6 గంటలకు స్వామివారి పల్లకి ఊరేగింపు, 7 గంటలకు అన్న ప్రసాద వితరణ జరుగుతుందని నిర్వాహకులు అర్జున్, గిరిధర్, లక్ష్మణ్ బుధవారం నాడిక్కడ ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ: దేవర

గోల్కొండ: రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేవారి గొంతులు నొక్కడం ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. శాంతియుతంగా చట్టానికి లోబడి ధర్నా నిర్వహిస్తున్న బీజేపీ కార్పొరేటర్లను అరెస్టు చేయడం అక్రమం అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కోట్లాది రూపాయల కుంభకోణం జరిగిందని, ఎస్ఎస్‌సీ పేపర్ లీకేజీని బయటపెట్టిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌ను అరెస్టు చేసి కేసు పెట్టడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు.

మర్యాదపూర్వక కలయిక



సీఎం జగన్‌ను కలిసిన మెట్టు విజయ్‌కుమార్

అబిడ్స్: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని టీటీడీ లోకల్‌బాడీ సభ్యుడు మెట్టు విజయ్‌కుమార్ కలిశారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన విజయ్‌కుమార్ బుధవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి జగన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు.


అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేయించామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. బుధవారం ఆయన టోలీచౌకీలోని తన కార్యాలయంలో నానల్‌నగర్, లంగర్ హౌస్ డివిజన్లకు చెందిన మజ్లిస్ ఏరియా కమిటీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో ప్రస్తుతం వెనుకబడ్డ ప్రాంతం ఒక్కటి కూడా లేదని, అన్ని ప్రాంతాల్లో వీడీ సీసీ రోడ్లు వేశామన్నారు. అంతేకాకుండా కార్వాన్ నియోజకవర్గంలో ప్రస్తుతం భారీ ఎత్తున నూతన డ్రైనేజీ పనుల నిర్మాణం జరుగుతోందన్నారు. వర్షాకాలంలో ముంపునకు గురయ్యే ప్రాంతాలలో ముంపు నివారణ కోసం కూడా పెద్ద ఎత్తున ప్రత్యేక వరదనీటి పైప్‌లైన్ల పనులు జరుగుతున్నాయన్నారు. నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఏరియా కమిటీ నాయకులు అలీముద్దీన్, సయ్యద్ జబ్బార్, మజీద్ తదితరులు ఉన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

గోల్కొండ: విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని బల్దియా గోల్కొండ డివిజన్ ఎంటమాలజీ సూపర్‌వైజర్ మహ్మద్ ఫయాజ్‌ఉద్దీన్ అన్నారు. బుధవారం గోల్కొండ బల్దియా వార్డు కార్యాలయం వద్ద ఎంటమాలజీ ఫీల్డ్ వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దోమల నివారణ కోసం నిర్దేశించిన పనిని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. ఇంటింటికీ తిరిగి దోమల నివారణ కోసం దోమల మందు స్ప్రే చేయాల్సిన అవసరాన్ని వివరించాలన్నారు. నీళ్లు నిల్వ ఉండే చోట దోమలు వృద్ధి చెందే ప్రమాదం ఉందని, ఆ ప్రాంతంలో మందును స్ప్రే చేయాలని ఆయన అన్నారు. గోల్కొండ కోట కందకాలు, చెత్తకుప్పల వద్ద తప్పకుండా దోమల మందు స్ప్రే చేయాలన్నారు.

మాల సంఘాల జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మధు



గన్‌ఫౌండ్రీ: మాల సంఘాల జేఏసీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా కొప్పుల మధు ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం జేఏసీ చైర్మన్ చెరుకు సుధాకర్ ఆయనకు గన్‌ఫౌండ్రీలోని సూర్యలోగ్ కాంప్లెక్స్ కార్యాలయంలో నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల మధు మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలోని మాల కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేపడతామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

చెరువులకు జలకళ

- భారీ వర్షాలకు నిండు కుండలా మారిన వైనం
- మరోవైపు పొంగుతున్న నాలాలు
- ఆందోళనలో సమీప ప్రాంత ప్రజలు



నిండు కుండలా గోల్కొండ కఠోర హౌస్

గోల్కొండ: వరుసగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండుకుండలా మారాయి. మరోవైపు నాలాలు పొంగిపొర్లుతున్నాయి. బుల్కాపూర్ నాలాలోకి హకీంపేటలోని ఎగువ ప్రాంతాల నుంచి వర్షపునీరు వచ్చి చేరుతోంది.. గోల్కొండ నయాఖిలాలోని చారిత్రక శాతం చెరువు సైతం నిండుకుండలా మారింది. కుతుబ్‌షాహీ రాజుల కాలం నాటి గోల్కొండ కఠోర హౌస్ మురుగు, వర్షపు నీటితో నిండిపోయింది.

- వరుసగా కురుస్తున్న వర్షాలకు కఠోర హౌస్‌కు జలకళ వచ్చింది.
- గోల్కొండ నయాఖిలా ప్రహరీని ఆనుకుని ఉన్న శాతం చెరువులో సైతం వరదనీరు భారీగా చేరింది.
- మరోవైపు హకీంపేట్ నుంచి అహ్మద్‌నగర్‌కు వెళ్లే బుల్కాపూర్ నాలా సైతం వర్షం తాకిడితో నాలాలో నీరు ప్రమాదకర స్థాయికి చేరింది.
- బుల్కాపూర్ నాలాలో పూడికలు తీయకపోవడం స్థానికులకు శాపంగా మారింది. బుల్కాపూర్ నాలా ఎప్పుడు పొంగుతుందోనని ఫిలిం నగర్ దిగువ బస్తీవాసులు ఆందోళన చెందుతున్నారు.
- నాలా నుంచి వస్తున్న దుర్గంధాన్ని తాము భరించలేకపోతున్నామని వారు వాపోతున్నారు.
- కఠోర హౌస్‌లో సైతం వర్షపునీటితో పాటు డ్రైనేజీ నీరు చేరింది. కఠోర హౌస్‌ను అభివృద్ధి చేస్తున్నామంటూ అధికారులు ఇస్తున్న హామీలు ఒక్కటి కూడా నెరవేరడం లేదు.దీని ప్రహరీ ధ్వంసమైంది. దీంతో స్థానికులు యథేచ్ఛగా చెత్తను డంపింగ్ చేస్తున్నారు.
- నయాఖిలాలోని శాతం చెరువు పనులు సైతం ముందుకు సాగడంలేదు. దీంతో చిన్న వర్షానికే వరదనీటితో చెరువు నిండుతోంది. మరోవైపు చెరువు అభివృద్ధి పనుల్లో భాగంగా భారీ ఎత్తున చెరువు కట్టపై మట్టి వ్యర్థాల డంపింగ్ చేస్తుండటం కొసమెరుపు.



శాతం చెరువులో చేరిన వర్షపు నీరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

ఎమ్మెల్యే అహ్మద్ పాషా ఖాద్రీ



బస్తీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే పాషా ఖాద్రీ

యాకుత్‌పురా: ప్రజా సమస్యల పరిష్కారానికి అన్ని ప్రాంతాల్లో పర్యటిస్తూ ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని యాకుత్‌పురా ఎమ్మెల్యే సయ్యద్ అహ్మద్ పాషా ఖాద్రీ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని తలాబ్ చంచలం డివిజన్‌లో బుధవారం ఆయన కార్పొరేటర్ డాక్టర్ సమీనాబేగం పలు విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. భవానీనగర్, చాచా గ్యారేజ్, తలాబ్‌కట్టా రోడ్డు నంబర్ 7,9,10,11 బస్తీల్లో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలపై ప్రజలను ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. డ్రైనేజీ, తాగునీటి సమస్యలను పరిష్కరించేందుకు నూతన పైప్‌లైన్ నిర్మాణ పనులను చేపట్టామన్నారు. రానున్న వర్షకాలంలో వరద నీటి సమస్యలు తలెత్తకుండా నాలా విస్తరణ, డ్రైనేజీ మ్యాన్‌హోల్ పూడికతీత పనులను చేపడుతున్నామన్నారు. పర్యటనలో మజ్లిస్ పార్టీ నాయకులు, జలమండలి, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

దాడి కేసులో నిందితుడికి మూడు రోజుల జైలు

డబీర్‌పురా: వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన కేసులో నిందితుడికి నాంపల్లి 6వ మెట్రో పాలిటన్ న్యాయమూర్తి ఎస్.లక్ష్మణ్ రావు మూడు రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసుల కథనం ప్రకారం... మీర్‌చౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గ్రాండ్ హోటల్ వద్ద ఉన్న మెకానిక్ దుకాణంలో అబ్దుల్ రెహమాన్ బుల్లెట్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. కాగా గత నెల 29న రాత్రి రెహమాన్ విధులు ముగించుకొని ఇంటికి వెళ్తుండగా.. హోటల్‌లో పని చేసే మహ్మద్ నజీర్ తాగి అకారణంగా దాడి చేసి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మీర్‌చౌక్ పోలీసులు నిందితుడ్ని అరెస్టు చేశారు. నజీర్‌ను నాంపల్లిలోని 6వ మెట్రో పాలిటన్ కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి మూడు రోజు జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. పోలీసులు నిందితుడ్ని జైలుకు తరలించారు.

ఐ లవ్ చార్మినార్



చార్మినార్‌ను సందర్శించిన అబ్దుల్ రోజిక్

చార్మినార్: హిందీ బిగ్‌బాస్ 15వ సీజన్‌లో పాల్గొన్న అబ్దుల్ రోజిక్ బుధవారం సాయంత్రం చారిత్రాత్మక చార్మినార్ కట్టడాన్ని సందర్శించారు. అక్కడి వాతావరణం చాలా బాగుందని.. ఐ లవ్ చార్మినార్.. ఐ లవ్ హైదరాబాద్ బిర్యానీ.. ఐ లవ్ హైదరాబాద్ అని తన సంతోషాన్ని వెల్లడించారు.

సునిశిత పరిశీలనతోనే అద్భుతాలు



విద్యార్థుల ప్రజెంటేషన్‌ను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ వరలక్ష్మి, అకాడమిక్ గైడెన్స్ అధికారి చారి

నాంపల్లి: కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్స్ ప్రజెంటేషన్ పోటీలకు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. మంగళవారం ప్రారంభమైన ఈ పోటీలు బుధవారంతో ముగిశాయి. మొదటి రోజు 23 గ్రూపులు పబ్లిక్ యాడ్ - పొలిటికల్ సైన్స్ అనే అంశంపై ప్రదర్శన ఇవ్వగా, 2వ రోజు మరో 23 గ్రూపులు కామర్స్ విభాగంలో ప్రదర్శనలిచ్చాయి. ఇందిరా ప్రియదర్శిని మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వరలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన పోటీలకు రెండవ రోజు జ్యూరీ సభ్యులుగా మనూ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ షేక్ కొమ్రుద్దీన్, ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఎ.ప్యాట్రిక్ హాజరయ్యారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులను వారు పరిశీలించారు. కార్యక్రమానికి డాక్టర్ యు.అనిత కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించారు. విద్యార్థులకు సునిశిత పరిశీలన అవసరమని, అలాంటి పరిశోధనలు చేసిన విద్యార్థులే అద్భుతాలు సృష్టిస్తారని ప్రిన్సిపాల్ వరలక్ష్మి అన్నారు. కూలంకుషమైన విషయ పరిజ్ఞానం కలిగిన ప్రాజెక్టులు అత్యధికంగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. పట్టుదలతో ఎంతో శ్రమించి వైవిధ్యభరితమైన ప్రాజెక్టులు రూపొందించిన విద్యార్థులందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

పెళ్లికి హాజరయ్యేందుకు వచ్చిన మహిళ అదృశ్యం



అదృశ్యమైన నూకల పద్మావతి

అఫ్జల్‌గంజ్: మహిళ అదృశ్యమైన ఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాఖ పట్నం ప్రాంతానికి చెందిన నూకల పద్మావతి (37) సంగారెడ్డిలో జరిగే పెళ్లికి హాజరయ్యేందుకు ఈ నెల 1వ తేదీ రాత్రి విమానంలో నగరానికి వచ్చింది. వనస్థలిపురం ఎన్‌జీఓస్ కాలనీలో ఉండే బంధువుల ఇంటికి వెళ్లింది. 2వ తేదీ ఉదయం పద్మావతి తన బంధువు ప్రియా కృష్ణమూర్తితో కలిసి ఎల్బీనగర్ మెట్రో స్టేషన్‌కు చేరుకుంది. ఆయన ఆమెను ఎంజీబీఎస్‌కు వెళ్లే మెట్రో రైలు ఎక్కించాడు. పద్మావతి ఎంజీబీఎస్‌లో సంగారెడ్డి వెళ్లేందుకు జహీరాబాద్ వైపు వెళ్లే బస్సు ఎక్కింది. తర్వాత బంధువులకు ఫోన్ చేయలేదు. సాయంత్రం ఆమెకు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చిందని ప్రియా కృష్ణమూర్తి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదృశ్యం కేసు నమోదు చేసిన అక్కడి పోలీసులు ఈ కేసును తదుపరి విచారణ నిమిత్తం అఫ్జల్‌గంజ్ పోలీసులకు బదిలీ చేయగా దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీభవన్ వద్ద బజరంగ్‌దళ్ ఆందోళన

పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తత



బజరంగ్‌దళ్ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: బజరంగ్‌దళ్‌ను నిషేధిత ఉగ్రవాద సంస్థ పీఎఫ్‌ఐతో కాంగ్రెస్ పార్టీ పోల్చడాన్ని నిరసిస్తూ భజరంగ్‌దళ్ నాయకులు గాంధీభవన్ వద్ద ఆందోళనకు దిగారు. బుధవారం ఉదయం పెద్ద ఎత్తున బజరంగ్‌దళ్ కార్యకర్తలు, నాయకులు, రాష్ట్ర కన్వీనర్ శివరాములు ఆధ్వర్యంలో గాంధీభవన్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. పోలీసుల అడ్డుకోవడంతో బజరంగ్‌దళ్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణ నెలకొంది. అనంతరం పోలీసులు బజరంగ్ దళ్ నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ శివరాములు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీకి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీ హిందూ వ్యతిరేక పార్టీ అని రుజువైందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఆ పార్టీ దిష్టిబొమ్మలను దహనం చేస్తామన్నారు.

గోల్కొండ ఆసుపత్రిలో ఇంకుడు గుంతల ఏర్పాటు

గోల్కొండ: భూమిపై పడ్డ ప్రతి వర్షపునీటి బొట్టు భూగర్భజలాలను పెంచుతాయని గోల్కొండ ఏరియా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ మజర్‌ఉల్లా అన్నారు. బుధవారం ఆయన ఆసుపత్రి ప్రాంగణంలో జరుగుతున్న ఇంకుడు గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూగర్భ జలాలు తగ్గడం వల్ల బోర్లు వట్టిపోతున్నాయని, తమ ఆసుపత్రి బోరులో వచ్చే నీరు కూడా బాగా తగ్గిందన్నారు. దీనికోసం తాము ప్రత్యేకంగా రెండు ఇంకుడు గుంతలను ఏర్పాటు చేస్తున్నామని, ఆసుపత్రి వెనుక భాగంలో మరో రెండు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఆయన వెంట ఆర్ఎంఓ డాక్టర్ ఖాజారౌఫ్ ఉద్దీన్ ఉన్నారు.

సినీ వ్యాస పురస్కారాల ప్రదానం



పురస్కార గ్రహీతలతో మామిడి హరికృష్ణ తదితరులు

గన్‌ఫౌండ్రీ: భారతీయ సినిమా 110 సంవత్సరాల సినీ వేడుకలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బుధవారం రవీంద్రభారతిలో యువ కళావాహిని ఆధ్వర్యంలో సినీ చరిత్రకారులకు సినీ వ్యాస పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వందేళ్ల సినిమా వైభవంపై డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కార్యక్రమంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వర్ రావు నాటక కళాపరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండల్‌రావు, సినీనటుడు ఉత్తేజ్, ఆధ్యాత్మిక వేత్త లంకా కుటుంబరావు, సినీ చరిత్రకారులు ఎస్వీ.రామారావు, సంజయ్ కిశోర్, యువకళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మమ్మల్ని కూడా రెగ్యులరైజ్ చేయండి

ప్రభుత్వానికి యూనివర్సిటీల కాంట్రాక్ట్ లెక్చరర్స్ వినతి



ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను కలిసిన సంఘం నాయకులు

విజయనగర్‌కాలనీ: పర్మినెంట్ లెక్చరర్స్‌తో పాటు విధులు నిర్వహిస్తున్న తమను కూడా రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీల కాంట్రాక్ట్ లెక్చరర్స్ జేఏసీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రిని కలిసి తమ సమస్యలను తెలిపి బుధవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న జేఏసీ ప్రతినిధులు రామేశ్వర్‌రావు, శ్రీధర్‌కుమార్, హర్షిత, హరీష్, జితేందర్ మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా విశ్వ విద్యాలయాల్లో విద్యార్థులకు ఉన్నత విలువలతో కూడిన విద్యను అందిస్తున్న తమ సేవలను ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రెగ్యులరైజ్ చేసేందుకు తమకు అన్ని అర్హతలు అన్నాయని, తమలో ప్రతిభకు లోటు లేదన్నారు. తమను రెగ్యులరైజ్ చేస్తామని గతంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన వాగ్దానాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల నుంచి వచ్చిన అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలంతా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్

దూద్‌బౌలి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకోవాలని చార్మినార్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో 47 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంటు సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల మేరకు చార్మినార్ నియోజకవర్గంలో కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఎల్లప్పుడు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. మజ్లిస్ పార్టీ పాతబస్తీలోని పేదల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నదన్నారు. నియోజకవర్గంలోని కార్పొరేటర్లందరూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో పాతబస్తీలో మజ్లిస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో బహదూర్‌పురా మండల వీఆర్‌ఐ సక్కురాం, మజ్లిస్ పార్టీ నాయకులు బాకర్ అలీ ఖాన్, ముజ్జు, హనీఫ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న బీఆర్ఎస్ నాయకులు

అబిడ్స్: బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు కోటి శైలేష కురుమ, పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్ అన్నారు. గోషామహల్‌లోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ సిబ్బందితో కలిసి వారు పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే నియోజకవర్గం ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మౌలిక వసతుల రూపకల్పనకు బీఆర్ఎస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నదని తెలిపారు.

ఆకట్టుకున్న కూచిపూడి అరంగేట్రం



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు డాక్టర్ నళినీ రమణ శిష్యురాలు గుత్తి భావన కూచిపూడి నాట్య రంగ ప్రవేశం బుధవారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. ఆనంద నర్తన గణపతి, భామ కలాపం, శివదీక్ష, శరణం భవ వంటి అంశాలపై చక్కటి హావాభావాలతో కొనసాగిన నృత్య ప్రదర్శనలు ఆహూతులను సమ్మోహన పరిచాయి. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, ఎంబీబీఎస్ పూర్తిచేసి కూచిపూడి నాట్యరంగ ప్రవేశం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ ఎస్వీ ప్రభాత్, తెలుగు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ భాగవతుల సేతురామ్, నృత్య గురువు డాక్టర్ ప్రసన్నరాణి, తల్లిదండ్రులు హరిప్రసాద్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా వాటర్‌బోర్డు అభివృద్ధి పనులు



బీఆర్ఎస్ నాయకులకు వివరాలు తెలుపుతున్న వాటర్‌బోర్డు జీఎం జాన్ షరీఫ్

అబిడ్స్: వాటర్‌బోర్డు అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడతామని వాటర్‌బోర్డు జనరల్ మేనేజర్ జాన్ షరీఫ్ అన్నారు. బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి జాంబాగ్‌లోని వాటర్‌బోర్డు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా వాటర్‌బోర్డు జనరల్ మేనేజర్ మాట్లాడుతూ, జాంబాగ్ డివిజన్‌లో మంత్రి తలసాని తమకు సూచించిన అభివృద్ధి పనులను త్వరగా చేపట్టేందుకు కృషి చేస్తామన్నారు. ఆనంద్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే మంత్రి తలసాని సహకారంతో పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందు కుమార్, మహ్మద్ మాజీద్, సయ్యద్ అసద్, అర్బాజ్, ఖలీల్, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థిలో అపారమైన ప్రతిభ ఉంటుంది




మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు

గోల్కొండ: ప్రతి విద్యార్థిలో అపారమైన ప్రతిభ ఉంటుందని గోల్కొండ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాసరాజు అన్నారు. బుధవారం కళాశాలలో ఐ క్వాక్ ఆధ్వర్యంలో సీసీఈటీఎస్ అనే యాప్ వినియోగం గురించి అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ యాప్ ద్వారా విద్యార్థుల డేటా మొత్తం నమోదు చేయబడతాయన్నారు. విద్యార్థుల హాజరు, వారు సాధించిన మార్కులు ఈ యాప్‌లో నమోదు చేస్తామన్నారు. అంతేకాకుండా ఈ యాప్ లాగిన్ అయి విద్యార్థులు వారికి అవసరమైన విషయాలు తెలుసుకోవచ్చని అన్నారు. వారు చదివిన డిగ్రీకి అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు ఈ యాప్ ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ఈ యాప్ వినియోగం వల్ల విద్యార్థులు ఐక్యూ పెరగడమే కాకుండా వారు వివిధ రకాల ఉద్యోగాల గురించి తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఐక్వాక్ ప్రతినిధులు ఇసాక్, శ్రీనివాస్, కోఆర్డినేటర్ డాక్టర్ బాల శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు డాక్టర్ జయశ్రీ, సుచేత, రఫియా, నోముల రజిని, సీరజ పాల్గొన్నారు.

అత్యంత వైభవంగా బోనాల జాతర నిర్వహిస్తాం..

మహంకాళేశ్వర ఆలయ కమిటీ నూతన అధ్యక్షుడు గాజుల అంజయ్య



చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మీరాలంమండి శ్రీ మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. బుధవారం దేవాలయ ప్రాంగణంలో జరిగిన దేవాలయ కమిటీ సర్వసభ్య సమావేశంలో ఆయనను కమిటీ సభ్యులు చైర్మన్‌గా ప్రతిపాదిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ... నగరంలో జరిగే ఆషాఢ బోనాల జాతర ఉత్సవాల్లో మీరాలంమండి జాతరకు ప్రత్యేకత ఉందన్నారు. భక్తుల కోరిన కోరికలు తీర్చే అమ్మవారికి నిత్యం దూప, దీప నైవేద్యాలు కొనసాగుతాయన్నారు.

ఆలయ నూతన కమిటీ..

ఆలయ వైస్ చైర్మన్‌లుగా జి.అనంతయ్య, జి.బుగ్గయ్య, శృంగారం ఆత్రేయాచార్యులు నియమితులైనట్లు ఆలయం కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా కాట కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా కాట రమేశ్, కోశాధికారిగా ఎ.రమేశ్, సంయుక్త కోశాధికారిగా గాజుల రాహుల్, కార్యదర్శులుగా సుందర్ అగర్వాల్, ఎం.శంకర్, బి.పవన్ కుమార్, డి.సాయిలు, కాట ప్రకాశ్, సీహెచ్.కిశోర్ కుమార్, సంయుక్త కార్యదర్శులుగా జి.జంగయ్య, కె.నర్సింగ్ రావు, మహేశ్ గుప్తా, జె.సాయినాథ్, కె.వినోద్ కుమార్ జైన్, ప్రచార కార్యదర్శులుగా సీహెచ్ శ్రీకాంత్, బి.లఖన్ కుమార్, ఎ.ధన్‌రాజ్, ఈ.శ్రీనివాస్, జి.నరేశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా శివశంకర్, ఆదిత్య, తాండవ్ కృష్ణ తదితరులు ఎంపికయ్యారని గాజుల అంజయ్య తెలిపారు.